# గాంధీయే దిగివస్తే?

**-శ్రీమోహనహరి**

ఆ రాత్రి, అద్భుతమైన అర్ధరాత్రి.

నగరంలోని విగ్రహాలలో చలనం కల్గింది!

ముఖ్యంగా మహాత్మాగాంధీ విగ్రహంలో విపరీతమైన చలనం కల్గింది.

మహాత్మాగాంధీ రోడ్డు చౌరస్తాలో ఉన్న గాంధీజీ 'జై శ్రీరామ్' అంటూ చేతిలోని కర్రని బలంగా పట్టుకుని సినిమా హీరోలా అంతెత్తు గద్దె మీద్నుంచి నేల మీదికి దూకేశారు.

చేతికర్ర సాయంతో వేగంగా ట్యాంకు బండ్ మీద్నుంచి నడుస్తున్నారు.

ఆయన వైపు బుద్ధుడు ఆప్యాయంగా చూశాడు.

ఫుట్‌పాత్ మీదున్న విగ్రహాలన్నీ పలకరింపుగా నవ్వాయి.

వాళ్ళందరికీ గాంధీజీ భక్తితో దండాలు పెట్టారు.

ట్యాంక్ బండ్ మరో చివరకు వచ్చేశారాయన.

బిర్లామందిర్ సొగసుని చూసి సంబరపడ్డారు.

అక్కడ మరో చౌరస్తాలో సూటూ బూటూ వేసుకుని చేతిలో పుస్తకం పట్టుకున్న మహాపురుషుని విగ్రహం గాంధీజీని చూసి బెదిరిపోయింది.

''బాపూజీ! మీరేనా? మరి ఇదేమిటి? మీరు అహింసామూర్తులుకదా! మరెందుకిలా! కర్రపట్టుకుని నా వైపు వస్తున్నారు. మీరు ఆదర్శాలను మరిచిపోయారా? వద్దు. నాకు భయమేస్తుంది. ముందు ఆ కర్ర పారేసి నా దగ్గరకు రండి'' అన్నారాయన.

గాంధీజీ ఆశ్చర్యంతో ఆగిపోయారు. ఆయన వైపు జాలిగా చూశారు. ఎంతమార్పు? నా మీద అనుమానమా? ప్చ్. పరిస్థితి అలా ఉంది మరి.. అనుకున్నారు మనసులో.

పైకిమాత్రం ''తమ్ముడూ! నువ్వు గొప్ప జ్ఞానివి. నా సంగతి నీకు తెలుసు. నేను అహింసా పూజారిని. ఈ కర్ర నా వృద్ధాప్యానికి ఆసరా కదా. మరచినావా? భయపడకు'' అన్నారు భరోసాగా.

ఎదురుగా ఉన్న మహాపురుషునికి ధైర్యం వచ్చింది. ఆప్యాయంగా నవ్వాడు.

''మీలాంటి జాతి పిత మీద అనుమానమా? ఇది నా తప్పు కాదు, బాపూజీ! ఈరోజుల్లో ఎవరు, ఎప్పుడు, ఎలా మారిపోతారో తెలీటం లేదు. ఎవరు మనవాడు? ఎవడు పరాయివాడు? అనేది తేల్చుకునే రోజులు కావి ఇవి...''అన్నాడాయన బాధపడుతూ..గద్దె దిగి క్రిందికి వచ్చాడు.

ఒకరినొకరు ఆప్యాయంగా ఆనందభాష్పాలతో తనివిదీరా చూసుకుంటున్నారు.

అదే సమయంలో ఆదర్శనగర్‌లో ఉన్న ఐస్ క్రీమ్ ఫ్యాక్టరీ తాలూకు సెక్యూరిటీ ఆఫీసర్ సర్‌ప్రైజ్ చెకింగ్ కోసం వెళ్తున్నాడు. వాళ్ళిద్దరిని చూశాడు. అపార్థం చేసుకున్నాడు. హడావిడిగా ఫ్యాక్టరీ ముందు స్కూటర్ ఆపి కంట్రోల్‌రూమ్‌కి ఫోన్ చేశాడు. ''ఉగ్రవాదులు మారువేషాల్లో ట్యాంకు బండ్ మీద తిరుగుతున్నారు. బహుశా ట్యాంక్‌బండుని పేల్చి వేయాలని ప్రయత్నిస్తున్నారని నా అనుమానం'' అంటూ పోలీసువాళ్ళని అదరగొట్టేశాడు.

పోలీసులు అలర్ట్ అయిపోయారు. ఫోన్లు చకచకా పని చేశాయి. పోర్టబుల్ వాకీటాకీలు రెడీ చేసుకున్నారు. ఆయుధాలలో బుల్లెట్లు నింపుకున్నారు.

ఇదంతా గాంధీజీకి తెలీదు. అస్సలు ట్యాంకు బండ్ మీదున్న విగ్రహాలలో ఏ ఒక్కర్తికైనా ఏం జరుగుతున్నదీ తెలీదు.

గాంధీజీ యధావిధిగా ''ఎలా ఉన్నావు, తమ్ముడూ! బాగున్నావా? ఏమిటిది? ఒకప్పుడు మనదేశంలో ఎక్కడ చూసినా నా విగ్రహాలే కనిపించేవి. ఆ తర్వాత మెల్లిమెల్లిగా జవహర్‌లాల్, ఇందిరాగాంధీ ఆ తర్వాత రాజీవ్‌గాంధీ ఆ తర్వాత నీ విగ్రహాల సంఖ్య అధికమౌతున్నాయ్. ఏమిటి సంగతి?'' అని ప్రశ్నించారు.

''మహాత్మా! ఆ కాలంలో బ్రాహ్మలు అగ్రస్థానంలో ఉండేవాళ్లు. ఇప్పుడు మావాళ్ళు అగ్రస్థానంలో ఉన్నారు. ఓట్ల పరంగా అతిముఖ్యులైపోయారు. అందుకే నా విగ్రహాలతో దండోరా మ్రోగిస్తున్నారు.''

గాంధీజీ నివ్వెరపోయారు.

''అదేమిటీ!? మనమంతా జీవితకాలం భారతదేశం కోసం పోరాడుతూ వచ్చే వాళ్ళం. మాలో కుల మత భేదాలు లేవప్పుడు. అందరం భారతీయులం. మరి ఇప్పుడేమో ఎక్కడ చూసినా జాతి, కులం, మతం, వర్గ భేదాలు సృష్టించుకుంటున్నారు. పేదవాడికి చిన్న గుడిసె కట్టుకోడానికి రెండు గజాల స్థలం దొరకటం లేదు. కానీ కుర్ర నాయకుల విగ్రహాలు వందల వర్గ మీటర్ల స్థానం ఆక్రమించుకుంటున్నాయ్...''

''ఔను. గాంధీజీ! మీరు చెబుతున్నది అక్షరాలా నిజం. ఇప్పటి కుర్ర నాయకులు తెలివిమీరి పోతున్నారు. ఓట్ల కోసం నోట్లు విసురుతున్నారు. స్వార్థంతో వోటర్లలో జాతి విభేదాలు సృష్టిస్తున్నారు. ఒకరినొకరు కత్తులూ కటార్లూ దూసుకునేలా చేసేస్తున్నారు.'' అన్నాడాయన మనస్ఫూర్తిగా కళ్ళల్లో నీళ్లు తెచ్చుకుంటూ.

''నిజమే సోదరా! ఏ వర్గ నాయకుడు గెలుస్తాడో ఆ నాయకుని విగ్రహాలు విచ్చల విడిగా ప్రతిష్టించుకుంటున్నారు. కొన్ని చోట్ల నా విగ్రహాలను తీసేసి ప్రాంతీయ నాయకుల విగ్రహాలను పెడుతున్నారు. అందువలన

ఒకరిపైన మరొకరికి ఈర్ష్య పుడుతోంది. హింస పెరిగిపోతుంది. అమాయకులు బలైపోతున్నారు.''

గాంధీజీ ఆనాడు బ్రిటిష్ వాళ్ళ ముందు పడినంత ఆవేశం మళ్ళీ పడుతున్నారు. అదే ఆవేశంలో ''తమ్ముడూ! ఇవ్వాళ నాయకులలో స్వార్థం పెరిగిపోయింది. వాళ్ళు మన విగ్రహాలకు దణ్ణం పెడుతున్నారంటే అది మనమీదున్న భక్తి కాదు. అమాయక ప్రజలను మభ్య పెట్టాలని దణ్ణం పెడుతూ దగా చేస్తున్నారు. అంతేగానీ మన బాధ ఎవ్వరికి కావాలి?''

''ఏదో మొక్కుబడిగా సంవత్సరానికి రెండు మూడుసార్లు మన విగ్రహాలను శుభ్రం చేస్తున్నారు. దండలు వేసి చేతులు దులుపుకుంటున్నారు. ఆ తర్వాత అదే దుమ్మూ, ధూళీ, వాహనాల పొగతో ఉక్కిరిబిక్కిరయి పోతున్నాము. అంతెందుకు చివరికి వీధి కుక్కలు మన దగ్గరకు వచ్చి కాళ్లెత్తి పిచికారి కొడుతున్నాయి. మనతో హోళీ ఆడుకుంటున్నాయి. పోనీలే, అవి నోరు లేని జీవాలు. మరి మనుషుల కేమొచ్చింది? ఇంట్లోని చెత్తా చెదారమంతా మన ముందు పారేస్తున్నారు. గాంధీ పార్కులు పందుల పార్కులయిపోతున్నాయి. ఒకటే కంపు! భరించలేక పోతున్నాను.

ఇంకా చెప్పుకుంటే పరువుపోతుంది. జాతిపిత అని పిలుస్తున్నారు. బాగానే వుంది. కానీ నా వేషం వేసుకుని రైళ్ళల్లో బిచ్చమెత్తుకునే వాళ్ళను తయారు చేస్తున్నారు. నా బాధ ఎవరితో చెప్పుకోను?'' గాంధీగారి కనుకొలకుల్లో నీళ్ళు క్షణకాలం గిర్రున తిరిగాయి.

''ఔను, జాతిపితా! మీ మాటలు వింటూంటే నా గుండె రగిలిపోతోంది. అందుకే నాదో విన్నపం. ఇట్లాగే మనమందరం అడపాదడపా కలుసుకోవాలి. సాధకబాధకాలు చెప్పుకోవాలి. ఏమంటారు?'' చేతిలోని పుస్తకం జారిపోకుండా జాగ్రత్త పడుతూ అన్నారాయన.

''ఔను. మనం కలుసుకోవాలి. మన కోరికలు చెప్పుకోవాలి..''

''స్వార్థం కోసం మన విగ్రహాలను వాడుకోరాదు.''

''ప్రతిరోజూ మన విగ్రహాలను శుభ్ర పరచాలి''

''పశువులనుంచీ, పోరంబోకుల నుంచీ మన విగ్రహాలను దూరంగా ఉంచాలి.''

''ఎవరైతే మన నిబంధనలు పాటిస్తారో వాళ్లకే మన విగ్రహాలను వాడుకునే హక్కు ఉంటుంది.''

వాళ్ళిద్దరిలో ఆనందోద్వేగం పెరిగింది.


''భారత్ మాతాకీ-జై'' ఒకేసారి అరిచారిద్దరు.

వాళ్ళిద్దరి నినాదాలు ట్యాంకు బండ్ మీదున్న విగ్రహాల చెవుల బడ్డాయి.

''భారత్‌మాతాకీ-జై''

''భారత్‌మాతాకీ-జై''

నగరం అంతా నినాదంతో మారు మ్రోగింది.



కంట్రోల్ రూమ్ నుంచీ బయలుదేరిన వ్యాన్లు, జీపులు సడన్‌గా ఆగిపోయాయి.

పోలీసులు నినాదాలు విని భయపడిపోయారు. ఆయుధాలను లోడ్ చేసుకుని ట్రిగర్ మీద వ్రేలిని పెట్టేసుకున్నారు.

''భారత్ మాతాకీ-జై''

''భారత్ మాతాకీ-జై''

ఈసారి నినాదాలు మరింత గట్టిగా వినిపించాయి.

పోలీసులు గాలిలో తుపాకులు పేల్చారు.

విగ్రహాలన్నీ తుపాకీ ప్రేలిన శబ్దం విన్నాయి.

నిశ్శబ్దం! ఎక్కడ చూసినా నిశ్శబ్దం!! బుద్ధుడు కళ్ళు మూసుకున్నాడు!!

గాంధీజీ తుపాకి శబ్దం విన్నారు. ఆయనకి గాడ్సె గుర్తుకొచ్చాడు!! బెదిరిపోయారు.

''సరే, తమ్ముడూ! నేను వెళ్ళొస్తాను.''

గాంధీజీ చేతి కర్రసాయంతో అతివేగంగా మహాత్మాగాంధీ రోడ్డు చౌరస్తా వైపు నడక మొదలెట్టారు.

పోలీసులు హడావిడిగా తిరుగుతున్నారు. నినాదాలు చేసిన గుంపు కోసం వెదకటం మొదలెట్టారు.

వాళ్ళకి ఎవ్వరూ కనిపించడం లేదు.

ఒక కానిస్టేబుల్ మాత్రం గాంధీజీని చూశాడు.

''సార్! సార్! అదిగో నినాదాలు చేసిన వాళ్ళ నాయకుడు'' అన్నాడు.

జీపు స్టార్ట్ అయింది. గాంధీజీ వెనకాల పరుగెత్తింది.

గాంధీజీ జీపుని చూశారు. మరింత వేగంగా నడుచుకుంటూ చౌరస్తాలో కొచ్చేశారు.

''జై శ్రీరామ్!'' అంటూ ఎగిరి గంతేసి తన గద్దెమీదెళ్లి యధావిధిగా నిల్చున్నారు.

తన కళ్ళముందు నడుచుకుంటూ వెళ్ళే విప్లవనాయకుడు అకస్మాత్తుగా మాయం అయ్యేసరికి పోలీసులు బాధపడ్డారు. వాళ్ళకి ఉక్రోషం వచ్చింది. మూల మూల వెదికారు. సందులు గొందులు వెదికారు. మహాత్మాగాంధీజీ విగ్రహం చుట్టూ అనేకనేకసార్లు జీపుతో ప్రదక్షిణలు చేశారు.

విప్లవ నాయకుని జాడలేదు!!

వెదికి వెదికి విసిగిపోయి పోలీసులు వెళ్ళిపోతుంటే మహాత్మా గాంధీజీ ఒక బరువైన నిట్టూర్పు విడిచి మళ్ళీ యధాప్రకారంగా విగ్రహంగా మారిపోయారు.

పాపం...గాంధీజీ!

★